# పిడగనీడ

అప్పుడే వచ్చి ఆగిన మెయిలు మూడో తరగతి పెట్టె చుట్టూ ముసిరారు ప్రయాణీకులు. అవధానిగారు అతిప్రయాసతో గుంపును త్రోసుకుంటూ గుంపులోంచి జొరపడి యెక్కి చేతిసంచితో ఓ కిటికీవార కూలబడ్డారు పైపంచతో చెమట వత్తుకుంటూ, ఇంకా పెట్టెలో కెక్కడానికి సఫలీ కృతులుకాలేని వారి అవస్థ చూస్తూ ప్లాట్ ఫారంమీద తిరిగే జనాన్ని చూస్తూ, యింకా యీ నరకంలో ఆరేడు గంటలు ఎలా గడపాలో అన్న చింతతో ఉన్న అవధాని గారికి 'మాస్టారు' అన్న పిలుపు వినిపించి అటు తిరిగారు. ఎవరో సూటూ, బూటూలో ఉన్న యువకునివంక ఒక్క క్షణం చూసి·తనని గాదన్నట్టు చూపు మరల్చుకున్నాడు.

''మాస్టారూ!'' మళ్ళీ పిల్చాడతను.

''నన్నా, బాబూ!''

''అవును, నన్ను గుర్తుపట్టలేదా అండి!''

''ఎక్కడో చూసినట్టుంది కాని, గుర్తురావడం లేదు నాయనా!''. కళ్ళజోడు సవరించుకుని నిశితంగా చూస్తూ ఇబ్బందిగా అన్నారు.

''నేనండి, మీ శిష్యుణ్ని కామేశాన్ని. గుర్తురాలేదా!''

''నువ్వా, కామేశానివా? కాకినాడలో చదువుకున్నావుకదూ!'' ఆశ్చర్యానందాలతో మాస్టారి కళ్ళు మెరిశాయి.

''అవునండి ఆ కామేశాన్నే. మరిచిపోయారనుకున్నాను. ఎన్నాళ్ళయిందో చూసి! నేను మారిపోయుండవచ్చుగాని, మీరేం మారలేదు. ఇలా యెక్కడికి వెడ్తున్నారో?'' ప్రశ్నలు కురిపించాడు కామేశం.

''మా అమ్మాయి యింటికి వచ్చాను. మళ్ళీ విజయనగరం వెడ్తున్నాను. అయితే నీవెక్కడ వున్నావు? ఏం చేస్తున్నావు? ఏం ఉద్యోగం?''

కామేశం అతని ఉద్యోగం చెప్పినపుడు మాష్టారికి దిగ్భ్రమ కలిగినట్టయింది చెప్పలేని భావాలు ఎన్నో ఒక్క సారిగా కలిగి తత్తరపాటు కలిగింది. మొదట నమ్మలేక పోయినా తర్వాత తడబాటు అణుచుకుంటూ -

''అలాగా! చాలాసంతోషం బాబూ, ఇంత వాడి వయినందుకు! నిన్నింత ఉచ్ఛస్థితిలో చూసినందుకు చాలా సంతోషం నాయనా!''

మాష్టారి తడబాటు చూసి కామేశం చిన్నగా నవ్వుకున్నాడు.

''రండి మేష్టారూ, యిక్కడ మరీ రద్దీగా వున్నట్టుంది. మా కంపార్టుమెంటులోకి రండి. అక్కడ విశ్రాంతిగా కూర్చుందురుగాని!''

''వద్దులేబాబు, ఇది నాకలవాటే, క్రొత్త ఏంలేదు టికెట్ అదీ కొనుక్కున్నాను. మళ్ళా మార్చడం ఇబ్బంది ఎంతసేపు ! కాస్తసేపు కళ్ళుమూసుకుంటే సరిపోతుంది!'' మొహమాటపడుతో అన్నారు.

''ఆ సంగతంతా నాకు వదిలిపెట్టండి, ముందుమీరు దిగిరండి. యిక్కడ మీరు కూర్చోలేరు. పదండి, పైగా ఇన్నాళ్ళకి కల్సుకున్నాం, కాసేపు మాట్లాడుకోవచ్చు'' అంటూ బలవంతపెట్టి దింపి ప్రక్కనున్న డవాలా బంట్రోతుతో ఏదో చెప్పి పంపించాడు కామేశం. మొహమాటపడుతూనే దిగి అతన్ననుసరించారు అవధానిగారు.

ఎన్నడూ ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు ఎక్కని మేష్టారు ఆ సుఖాన్ని తనివి తీరా అనుభవించారు, కొన్ని నిమిషాలు, అంతకన్నా ఆయన ఆలోచనల్లో ఎక్కువగా నిండింది కామేశం అదృష్టం. ఇంకా ఇంకా నమ్మలేనట్టు ఆశ్చర్యం అయన మొగంమీదనే స్పష్టంగా కనబడ్తోంది. అది గమనించినట్టు కామేశం అన్నాడు.

''అయితే, మాష్టారూ! ఇంకా మీకనుమానంగానే వుందా! నాలాంటి మొద్దబ్బాయి బళ్ళో ఏ పరీక్షా మొదటి సారి పాస్ కాని వాడు, యీరోజు యింత ఉన్నత పదవి యెలా పొందాడా అని.''

పట్టుబడ్డ దొంగలా తడబడ్తూ ''అదేమిటోయి, ఏదో చిన్నప్పుడు కొంచెం అజాగ్రత్తగా వుండేవాడినని ఎప్పుడూ అలాగే వుంటావా? నువ్వింత వాడవయినందుకు చాలా గర్వంగా ఉందోయ్. నా శిష్యులు మీరు పెద్ద చదువులు

చదివి, పెద్ద హోదాల్లో వుండడం, నన్నింకా ఇలా గుర్తుంచుకుని అప్పటి మన సంబంధాన్ని మన్నించడం, ఇదంతా నా కెంత సంతోషకారణం చూడు.... అది సరేగాని పెళ్ళయిందా, పిల్లలా?'' మాట మార్చారు అవధనిగారు.

''పెళ్ళయి అప్పుడే ఒకబ్బాయి అమ్మాయి! అయితే మీ అబ్బాయి రామం ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు?''

''రాము! ఇంకెక్కడి రామం నాయనా! అప్పుడే పోయిఅయిదేళ్ళు అవుతంది. రామమేవుంటే యీనాడు ఇలా దిక్కులేకుండా ఒంటరిగా ఇలా యీ ముసలితనంలో అవస్థపడతానా?''

''అదేమిటి రామం పోయాడా?''

''అవును నాయనా! మహమ్మారి కలరా నానించి తీసుకుపోయింది. చేతికందిన కొడుకుని, ఒక్కగానొక్కణ్ణి! నా తలకొరివి పెట్టవలసినవాడిని తీసుకుపోయింది. వాడికి నేనే కొరివి పెట్టవలసి రావడం నా దౌర్భాగ్యం. ఆవిడ అదృష్టవంతురాలు. యీ బాధలన్నీ నన్ను పడమని, నాఖర్మానికి నన్నొదిలి ముందే దాటిపోయింది. ఒక్క కూతురు వున్నా పరాయిదేకదా! పాపం అక్కడికీ అది 'కూతురుగూడ చచ్చిపోయిందనుకున్నారా, నా దగ్గిరవచ్చి వుండకూడదా?' అని బలవంతం చేస్తుందిగాని ఎలా వుండగలను? ఎన్నాళ్ళు కూతురింట్లో కూర్చోడం? ఇంకా కాలు చేయి ఆడుతూండగా ఒకరి పంచని ఎందుకు జేరడం అని ఏదో పది రోజులుండి వచ్చేస్తుంటాను.. ఏదో, ఆ ఉన్న స్వంతకొంపలో, ఓపిక వున్న రోజున వండుకుంటూ లేని రోజున పస్తుంటూ ఆ పెన్షన్ రాళ్ళతో జీవితం వెళ్ళదీస్తూ, ఆ రోజు ఎప్పుడు వస్తుందా అని చూస్తున్నాను!''

''పాపం, మీకీ పెద్దవయసులో రాకూడని కష్టమే వచ్చింది''

''ఏం చేస్తాం ఎలాంటివాడికైనా ఖర్మ అనుభవించక తప్పదు!''

''మేష్టారూ, మీరు వైజాగ్‌లో దిగి నా దగ్గర నాలుగురోజులుండాలి. కాదనకండి. మీరు తప్పకుండా వచ్చి నా ఆతిథ్యం స్వీకరించి, మమ్మల్ని దీవించి మరీ వెళ్ళాలి!''

''అబ్బే, అంత మాటనకు, ఇంత పెద్ద హోదావుండి, చిన్ననాటి గురువు పట్ల ఇంత ఆదరాభిమానాలు చూపుతున్నవు, అంతేచాలు. మీరంతా పదికాలా లపాటు చల్లగా వుండడమే నాకు కావాలి. ఏమనుకోకు, మరోసారి ఎప్పుడైనా వస్తాన్లే''

''మొగమాటపడకండి మేష్టారూ! మీకే ఇబ్బంది జరుగదు. మీ ఇల్లే అనుకోండి. ఇన్నాళ్ళకి కనబడ్డారు, మిమ్మల్నేలా వదలను? మీ కోసం కాదు, ఇది నా ఆనందం కోసం. మీరు రాక తప్పదు.''

అవధానిగారి మొహం ఆనందంతో వెలిగింది. కామేశం ఆదరం, అభిమానం ఆయన్ని వషం చేసుకున్నాయి.

పోర్టికోలో కారు దిగగానే ''రండి మేష్టారూ!'' అంటూ ఆదరంగా లోపలికి పిల్చుకెళ్ళాడు కామేశం. పెద్ద అధునాతనమైన బంగళా, చుట్టూ విశాలమైన ఆవరణ. గేటుకి బంగళాకీ మధ్య రోడ్డుకి రెండువైపులా చక్కని పూలతోట. ఆ వైభవాన్నంతటినీ చూస్తూ లోపలికి అడుగుపెట్టారు. పెద్దహాలు, ఖరీదయిన తివాచి, నిగనిగలేడే సోఫాసెట్టు, గుమ్మాలకి అందమైన తెరలు, గోడల్ని చక్కని దృశ్యాలు, పూలవాజులు అన్నీ పొందికగా అమర్చి ఉన్నాయి.

''లీలా! యీయన అవధానిగారని నా చిన్ననాటి గురువుగారు. రైల్లో కనిపిస్తే మనింటికి ఆహ్వానించాను'' అంటూ భార్యని పరిచయం చేశడు కామేశం.

లీల వినయంగా నమస్కరించింది

''లీలా, ముందు కాఫీ పంపించు, ఆచేత్తో ఏదయినా ఫలహారం కూడా చేయిందు. ఉదయం అనగా ఎప్పుడో భోంచేశారు మేష్టారు... మాష్టారు గారికి గెస్టురూము సర్దించు''.. కామేశం భార్యకి పురమాయించాడు.

అవధానిగారికోసం ఓగది కేటాయించారు. ఆయన సదుపాయాలు భార్యా భర్తలిద్దరూ స్వయంగా చూశారు. ఆయన కేలోటురాకుండా చూడాల్సిన బాధ్యత భార్యకే అప్పగించాడు కామేశం.

రాత్రి భోజనాల దగ్గిర కామేశం దంపతులు బలవంతం చేసి అవధానిగారి మొహమాటాన్ని వెనక్కి నెట్టించారు. ఆ ఇంటిని, ఆ ఇంటి పొందికని, ఆ దంపతులని , వాళ్ళ పిల్లల్ని, వాళ్ళ భోగభాగ్యాల్ని వారు తనపట్ల చూపుతున్న ఆదరాభిమానాలని చూసి అవధానిగారు తబ్బిబ్బు అయిపోయారు.

భోజనం చేస్తూ, మాటల సందర్భంలో కామేశం అన్నాడు-

''మాష్టారూ, మీ సూర్యం ఇక్కడే వున్నాడు తెలుసా?''

''సూర్యం!.. సూర్యం అంటే నీ క్లాస్ మేట్ అతనే కదూ!''

''ఆ.. ఆ.. అతనే, మీ అనుంగు శిష్యుడే!'' అదోలా నవ్వాడు.

''ఇక్కడే వున్నాడా? ఏం చేస్తున్నాడు?''

''నా ఆఫీసులోనే గుమస్తా''

''గుమస్తానా?!.. అంత బ్రిలియంట్ స్టూడెంట్!'' అప్రయత్నంగా మాష్టారి నోటివెంట అపనమ్మకం, నిరాశ లాంటి అనుభూతులు మిళితమయి వినిపించాయి.

కామేశం నుదురు చిట్లించాడు.

''అదేమిటోయి కామేశం, సూర్యం ఎందుకలా అయ్యాడు? పైకిచదవ లేదా? ఎంతవరకుచదివాడు?'' ఆత్రుతగా ప్రశ్నించారు.

''ఏమో అవన్నీ నాకు తెలియవండి, యింటర్ లోనే చదువు మానేసినట్టున్నాడు..'' ముభావంగా అన్నాడు కామేశం.

''అయ్యోపాపం! ఎంతో తెలివైనవాడు. పైకి వస్తాడనుకునే వాడిని, ఇలా అయ్యాడాచివరికి!'' మేష్టారు ఆవేదనగా నిస్పృహగా అన్నాడు. ''అయితే, ఎప్పుడైనా ఇక్కడికి వస్తుంటాడా? అతని ఇల్లెక్కడో నీకు తెలుసా?'' కుతూహలంగా ప్రశ్నించరు.

''అతని ఇల్లు నాకెందుకు తెలుస్తుంది చెప్పండి! ఎప్పుడయినా, ఆఫీసు పనిమీద అతనే ఇక్కడికి వస్తుంటాడు'' ముభావంగా అన్నాడు కామేశం.

కామేశం ముభావత చూశాక చటుక్కున గుర్తుకు వచ్చింది మాష్టారికి, కామేశం ఉన్నతోద్యోగిఅని, సూర్యం అతనికి చాలా క్రింద గుమాస్తా అని! ఇంక ఆ విషయమేం అడక్కుండా మాట మార్చేశారు.

ఆ రాత్రి మెత్తన పరుపు మీద చల్లని గాలివీచే ఫేనుక్రింద పడుకుని ఏనాడూ అంతటి అదృష్టానకి నోచుకోని మాష్టారు ఆదమర్చి నిద్రపోవలసిందిపోయి, కంటికి కునుకురాక, మెదడంతా ఆలోచనల్తో గజిబిజి అయి మథన పడ్డాడు.

కామేశం పెద్ద ఉన్నతోద్యోగి! సూర్యం అతని క్రింద గుమస్తా! అయన అంచనాలు ఎంత ఘోరంగా తారుమారుయ్యాయి? కామేశం ఎంత అల్లరి చిల్లరగా తిరిగేవాడు! ఎప్పుడూ చదువులో అందరికంటే వెనకే! అల్లరిలో మొట్ట మొదట! తన చేత ఛీవాట్లు తినని రోజువుందా? ఏ పేపర్లోనూ పది మార్కులు రాకపోయినా ఏదో పేరుమోసిన జడ్జిగారబ్బాయని చూసి చూడనట్టు పైకి నెట్టేవారు. కాని స్వతహాగా ఏ పరీక్షా ప్యాసుగాలేదు. ఆడపిల్లలను ఏడిపించడం, పేర్లు పెట్టడం, గోడల మీదరాయడం, మేష్టార్లని ఎగతాళి చెయ్యడం, ఎవరన్నా

ఏమయినా అంటే రౌడిమూకని వెనకేసుకుని అల్లరి – ఇదే ధ్యాస తప్పించి చదువు లేదు. మిగతా మేష్టర్లంతా విసుగుపుట్టి అతని కర్మానికి అతన్ని వొదిలి ఊరుకున్నారు. ఆయనవమాత్రం ఒక విద్యార్థి అలా పాడవడం చూస్తూ ఊరుకోలేక కామేశాన్ని సంస్కరించే పనికి పూనుకున్నారు కొన్నాళ్ళు. ''చూడు కామేశం సూర్యాన్ని చూసి నేర్చుకో, బాగుపడే లక్షణాలు అవి, మీ నాన్నగారి పేరుప్రతిష్ఠలు చూడు, ఆయనపేరు చెడకుండా వుండాలనైనా కొంచెం చదువు. రోజుకో డ్రస్, నిగనిగలాడే బూట్లు కట్టుకుని స్టైలుగా తయారవడమేగాని, పొట్ట చించినా అక్షరం ముక్క లేదు. నీలాంటివాడు నా క్లాసులో వుండడం నాకే సిగ్గుచేటు, అవమానం!'' ఇలా అనేకవిధాల అతన్ని మంచిగా ఒకప్పుడు, రెచ్చగొట్టి పౌరుషం తెప్పించి మరోప్పుడు, ప్రయత్నించారాయన. కాని, ఫలితం శూన్యం. ''ఆ సూర్యంగాడికి నాకూ పోలికా! వాడొక పుస్తకాల పురుగు నాకలా ఇరవై నాలుగు గంటలూ బుర్ర పుస్తకాల్లో దూర్చినట్లు రుబ్బుతాడు. నాకా అవసరం లేదు. వాడిలా చదివితే వాడికంటే బాగానే వస్తాయి మార్కులు!'' ''స్కూలుకి కుళ్ళు బట్టలు, కంపు బట్టలు వేసుకు రావాలి కాబోలు. ఆ సూర్యం గాడిలాగా! కుళ్ళు బట్టలు కట్టుకుంటే చదువొచ్చినట్లే కాబోలు! కాస్త బాగుంటే చూడలేక ఏడుస్తారు. కుళ్ళు వెధవలు'' అలా నోటికొచ్చినట్టు మేష్టారికి వినిపించేటట్టు పరుషవాక్యాలు మాట్లాడేవాడు కామేశం. ఇక ఆ తర్వాత మాష్టారు కూడ ఆశవదులుకుని అతన్ని గురించి పట్టించుకోడం మానేశారు. ఒక విధమైన ఏహ్యం ఇద్దర్లోనూ ఒకరియెడ ఒకరికి పెరిగి గోడలా నిల్చింది. కామేశాన్ని బాగుపరచ దల్చుకున్న అవధానిగారికి కలిగిన నిరాశ అప్పట్లో అతన్ని ద్వేషించేటట్టు చేసింది. తండ్రి ఆర్జించాడు గాబట్టి ఎలాగో పొట్టపోసుకుంటాడని అతని జోలికి పోవటం మానేసి, అతని ఉనికే పట్టనట్టూరుకొనేవారు.

సూర్యం మొదటినుంచీ అతివినయ విధేయతలుగల అతి చురుకైన విద్యార్థిగా మంచి పేరు తెచ్చుకున్నాడు. తెలివి తేటలకి తోడు, కష్టపడిచదువుతాడు. అందుకే అన్ని క్లాసుల్లోను అన్ని సబ్జక్ట్సుల్లోనూ అతనే ఫస్టు. సూర్యం అంటే అవధానిగారికి ప్రతేకాభిమానం. ఆయన పాతికేళ్ళ సర్వీసులోనూ అంతటి ఉత్తమ విద్యార్థిని ఎన్నడూ చూడలేదని అంటుండేవారు. అతను చాలా పైకి వెళ్ళి తనకి మంచి పేరు తెస్తాడని, అతనికేం చెప్పినా వృథాకాదని ఇంటికి పిల్చుకుని శ్రద్ధగా పాఠాలు వేరే ప్రత్యేకంగా చెప్పేవారు. సూర్యం స్కూలుఫైనలు రాష్ట్రం మొత్తంమీద మొదటివాడిగా పాసయినపుడు ఆయన ఆనందం వర్ణనాతీతం. అతను కాలేజీ చదువుకి వెళ్తుంటే తనకి దూరమై పోతున్నాడని అలాంటి విద్యార్థి తనకింక దొరకడని ఏదో తెలియని ఆవేదన పడ్డారు. సూర్యం ఇంటర్

చదవడానికి వెళ్ళిన మరుసటి ఏడే మాష్టారు రిటైరై స్వంత వూరు విజయనగరం చేరుకున్నారు.

తర్వాత మళ్ళా ఇన్నాళ్లకి ఇద్దర్నీ ఇలా తన అంచనాలు తారుమారు అవగా చూసిన మేష్టారు ఆరాత్రి సరిగా నిద్రపోలేక పోయాడు. సూర్యం యెందుకిలా అయ్యాడు? ఆయన కొడుకు, ఒక్కగానొక్క కొడుకు ఆయన్ని దగాచేసి వెళ్ళిపోయినప్పటిలాగా ఆయన మనసు ఆందోళనచెందింది.

★ ★ ★ ★ ★

మూడురోజులు కామేశం దంపతుల బలవంతంమీద వుండిపోక తప్ప లేదు మాష్టారికి. ఆయన అంత చిన్నచూపు చూసి, నిర్లక్ష్యం చేసిన కామేశం, ఆయనని ఎంతమాత్రం లెక్కచెయ్యకుండా అమర్యాద చేసిన కామేశం యీరోజు ఇంతలా మారిపోయి, గతం మరచి ఆయనని మర్యాదల్తో ముంచెత్తుతుంటే అవధానిగారికి బిడియంగా వుంది.

వచ్చిన రెండురోజులకి, కామేశానికి ఆ ప్రసక్తి ఇష్టముండదని తెలసీ ''కామేశం - సూర్యం ఇల్లెక్కడో ఎవర్నైనా చూపించమందూ! ఎలాగో ఇక్కడికి వచ్చిను, వున్నాడని తెలిసీ చూడకుండ వెళ్లలేను. అతని ఇల్లు తెలిసిన బంట్రోతుని ఎవరినైనా పంపిస్తే వెళ్ళొస్తాను'' అన్నారు. మేష్టారు. సూర్యాన్ని చూడాలన్న కాంక్ష ఆయనలో మరీ ప్రబలింది.

''మీరు వెళ్ళేదేమిటి మాష్టారు. కబురు పెడ్తే వాడే వస్తాడు.!'' నిర్లక్ష్యంగా అన్నాడు కామేశం.

కబురువెళ్ళిన అరగంటకి రెక్కలుగట్టుకు నిలబడ్డ సూర్యాన్ని చూస్తూనే మాష్టారు ఆనందంతో ఎదురెళ్ళి ''సూర్యం గర్తున్నానా? ఎన్నాళ్లకి చూశాను!!'' అంటూ ఆప్యాయంగా కౌగలించుకున్నంత పని చేశారు.

''మేష్టారు, మీరా! యిక్కడికెలా వచ్చారు?'' ఆశ్చర్యపోయాడు సూర్యం.

''మన కామేశం రైల్లో కనిపించి బలవంతంపెట్టి తీసుకువచ్చాడు. ఏదో యీ విధంగా నిన్ను చూడ్డం జరిగింది ఎంత మారిపోయావు? యిదివరకటి పోలికలే లేవు! ఏమిటి ఈ ఉద్యోగంలో చేరావు? పైకి చదవలేదా?'' ప్రశ్నలు కురిపిస్తూ ఆప్యాయంగా అతని చేయి వదలకుండా పట్టుకున్నారు.

ఏదో చెప్పబోతున్న సూర్యం, కామేశం రాకతో బెదిరిపోతూ నిల్చున్నాడు.

''చూశారా మాష్టారూ, మీ ముద్దుల శిష్యుణ్ణి!''

''చూశాన్నాయనా నీ ధర్మమా అని! ఇన్నాళ్ళకి కల్సుకున్నాం. సూర్యం చాలా మారిపోయాడుగదోయ్! గర్తుపట్టలేనంత మారిపోయాడు! ముప్ఫై ఏళ్ళవాడు ఏభయ్యేళ్ళవాడిలాగా కనబడుతున్నాడు గదూ!''

కామేశం మొగం చిట్లించి సూర్యాన్ని ఉద్దేశిస్తూ ''ఆ.. నిన్నటి డ్రాఫ్ట్ పూర్తి అయిందా? ఇవాళ తప్పకుండా వెళ్ళాలి.''

సూర్యం మొగం పాలిపోయింది.

''లేదుసార్, ఇంకా డాటా పూర్తిగా నాకందలేదు'' నసుగుతూ భయం భయంగా అన్నాడు.

''అందలేదు! ఎందుకందుతుంది! చేతులు కాళ్ళు ముడుచుకు కూర్చుంటే అన్నీ వాటంతటవే మీ వళ్ళోకి వస్తాయా? నిన్ననగా చెప్పాను. నాయెదుట తలాడించి అవతల నిద్రపోతేసరి! యిదేం ఆఫీసు పనా మరోటెనా మీ ఇష్టం వచ్చినట్టు ఆడుతూ పాడుతూ చేయడానిక!'' కఠినంగా అన్నాడు కామేశం.

''ఇంకో గంటలో పూర్తిచేస్తానండి! రాత్రి పది గంటలదాకా అక్కడేవున్నాను. యీ ఉదయం ఎనిమిది గంటలకే అక్కడికి వెళ్ళి ఆరంభించాను.. అయినా చాల వుందండి. అవలేదు.'' వినయంగా చెప్పబోయాడు సూర్యం

''మీరెన్ని గంటలు పనిచేశారో, ఎప్పుడు పడుకున్నరో అదంతా నా కనవసరం, నాక్కావలసింది పని, ఇంకో గంటలో ఆ కాగితాలు నా టేబిలుమీద వుండాలి'' ఆజ్ఞాపించాడు కామేశం.

అతనిమాటలింకా పూర్తికాకమునుపే కామేశానికి నమస్కారం పెట్టి మాష్టారి వైపు బింకంగా చూచి తలవంచుకు గబగబ వెళ్ళిపోయాడు సూర్యం.

''స్నానం ఫలహారం అయిందా మేష్టారూ'' మర్యాదగా నవ్వుతూ అడిగాడు కామేశం.

కళ్ళెదుట జరుగుతున్నదంతా ఏదో కలలోనన్నట్లు భిన్నుడై చూస్తున్న అవధానిగారు ఎలాగో తేరుకొని ముక్తసరిగా తల ఊపారు. మాష్టారి మొహం చూసి కామేశం కళ్ళలో ఒక చిన్న నవ్వు తొంగిచూసింది.

''ఏమిటి మాష్టారు అలా చూస్తున్నారు. ఒకనాడంత తెలివైనవాడు.

కష్టపడి చదివే సూర్యం యీ రోజిలా పని చెయ్యడం లేదని చివాట్లు తింటున్నాడని ఆశ్చర్యపోతున్నారా? వాడిప్పుడు ఉత్త పనిదొంగ. ఏదో చిన్నప్పుడు నూటికి నూరు మార్కులు కొట్టాననన్న గొప్ప తప్పిస్తే, ఇప్పుడసలు కాగితం ముట్టడు. నాలుగు లైన్లు రాస్తే నూరు తప్పులు. ఏదన్నా అంటే తొంభై వంకలు చెప్తాడు!''

విషణ్ణుడై చూశారు మాష్టారు.

''లీలా, మేష్టారిని మనదగ్గరే వుంచేసుకుందాం పాపం, ఆయన యీ వృద్ధాప్యంలో చెయ్యికాల్చుకుని వంటరిగా నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడే మనతోపాటు ఉండి పోతే ఆయనకి ఈ వయసులో కాస్త సుఖంగా వుంటుంది.'' ఆరోజు మధ్యాహ్నం భోజనాలదగ్గర అన్నాడు కామేశం.

''అలాగే దానికేముంది! ఆయనకి వేరే చేసేదేముంది? ఆయన మనకేం బరువు? తప్పకుండా వుండిపోండి మాష్టారు!'' లీల మనస్ఫూర్తిగా అంది.

ఆ ప్రసంగం అర్థమే కానట్టు ఆయోమయంగా ఇద్దరివంకా చూసి ఖంగారుగా ''అదేమిటోయ్! అదేమిటి నేనెలా వుండిపోతాను కామేశం! ఏదో నాలుగురోజులుంటే బాగుంటుంది కాని, ఎప్పుడూ యిక్కడే వుండమంటారేమిటి నన్ను అనవసరంగా మొహమాటంలో పెట్టకు. నేను రేపొద్దున వెళ్ళిపోవడానికి నిశ్చయించాను. నాకింక అడ్డు చెప్పకు'' అన్నారు అవధానిగారు.

''మేష్టారు, నామాట వినండి, మిమ్మల్ని యింట్లో వుంచుకొనే యోగ్యత నాకు లేదా! మీరుండడంవల్ల మా కెంతమాత్ర కష్టంలేదు. బరువుకాదు. యింతలో మా సిరి సంపదలు ఏమీ తరిగిపోవు.. మీ రేం సంకోచించవద్దు...''

''అదికాదు కామేశం! నువ్వు నాలాంటివాళ్ళని పది మందిని పోషించగల వాడివి గావచ్చు. అయితే మాత్రం నే నెలా వుండిపోతాను శాశ్వతంగా ఇక్కడ! నువ్వు ఏదో ఆభిమానంకొద్దీ వుండమంటే మాత్రం వుండడడం నాకమేన్నా బాగుంటుందా?''

''ఏం ఎందుకు బాగుండదు? మీ కొడుకు ఇంట్లో వుండరా? అలాగే నన్ను మీ రామం అనుకోండి.''

మేష్టారుకళ్ళు చెమర్చాయి. ''అంతమాటన్నావు, చాలు నాయనా! కాని మరి బలవంత పెట్టకు. ఏదో దేముడు కృపవల్ల ఇంకా కాళ్ళూ చేయి ఆడుతూంది. ఇంకొకరిమీద ఆధారపడడం నాకిష్టం లేదు. ఏదో యీ చివరిరోజులు స్వంత ఇంట్లోనే వెళ్ళదీస్తాను.''

''మీరు మామీద ఆధారపడ్డానికి ఏముంది? మేము మీకు ప్రత్యేకంగా చేసేదేముంది, అన్నింటికి నౌకర్లు వున్నారు. మీరు వెళ్ళిపోతావంటే నాకు చాలా కష్టం కలుగుతుంది. ఆ మాత్రం నాలాంటి వాడు మీకు చెయ్యగూడదా?''

''ఉండిపోండి మేస్టారు! పిల్లలుకూడా తాతగారు, తాతగారు అంటూ మీచేత కథలు అవి చెప్పించుకుంటున్నారు. మాకు మాత్రం పెద్దదిక్కు ఎవరున్నారు, మా కిబ్బంది అని ఎంతమాత్రం సందేహించకండి'' లీల కూడా బలవంతం పెట్టింది.

''ఏమిటి కామేశం, ఏదో ఒకరోజు వుండిపోదామని వచ్చినవాణ్ణి యిలా బలవంతం పెట్టడం ఏమన్నా బాగుందా?''

''తప్పేముంది మాష్టారు! యీ వృద్ధాప్యంలో చీకు చింతా లేకుండా రోజులు గడపండి, ఇంక మీరు నా మాట కాదనడానికి వీలులేదు.''

ఏదో యింకా అనబోతున్న మేస్టారికి మాట్లాడ్డానికి అవకాశ మివ్వకుండా వెళ్ళిపోయాడు కామేశం.

ఉదయమే లేచి కాలకృత్యాలు పూర్తి చేసుకుని, జపం ముగించి, కాఫీ ఫలహారాలు చేస్తారు అవధానిగారు, కాసేపు కామేశం పిల్లల్తో ఆడుకుని, తోటలో తిరిగి తోట మాలికి సలహాలిస్తూ, చదువుకుంటు, పన్నెండు గంటల వరకు కాలక్షేపం చేసి, భోజనం చేసి, విశ్రాంతి తీసుకుని లేచి, కాఫీ త్రాగి, సాయంకాలం పిల్లలు స్కూలినించి తిరిగిరాగానే వాళ్ళ కబుర్లువింటూ, వాళ్ళకి కథలు చెప్తూ కాసేపుగడిపి, ఓ అరగంట అలా షికారువెళ్ళి, ఆఫీసునించి యింటికి వచ్చిన కామేశంతో కాసేపు మాట్లాడి, భోంచేసి, ఏదో పుస్తకం చదువుతూ నిద్రపోవడం - అవధానిగారి దినచర్య.

ఆయనకి ఆ వయసులో వేళపట్టున శుభ్రమైన తిండి తినడం, మనుమలు లేని కొరత, ఆ ముద్దుముచ్చట్లు కామేశం పిల్లలద్వార తీరడం రామం లేనిలోటు కామేశం తీర్చడం అంతా బాగానేవుంది. చీకు చింతా లేకుండా వెళ్ళిపోసాగాయి రోజులు, లీల, కామేశం కురిపిస్తున్న ఆదరాభిమానాలతో దేనికి లోటులేకుండా సుఖంగావున్నా మేస్టారి మనసు అప్పుడప్పుడు ఎంతో బాధపడేది. దానికి కారణం సూర్యం.

సూర్యాన్ని చూసినప్పుడల్లా అవధానిగారి హృదయం ఆవేదనతో కుమిలి పోయేది. దైన్యంగా, నీర్సంగా, అలసటతో కూడిన ఆ మొహం చూసినప్పుడల్లా ఆయన హృదయం ద్రవించేది. ఎలాంటివాడు ఎలా అయిపోయాడు? సూర్యంతో

మాట్లాడే అవకాశం చిక్కలేదు మేష్టారికి గడిచిన నెలరోజులలోనూ ఎంతలేదన్నా అయిదారు సార్లు సూర్యంయింటికి వచ్చాడు. కామేశం ఇంకా లోపల ఉండగా అతన్ని చూసి అవధానిగారు గబగబ గదిలోంచి వచ్చి, ఆరాటంగా ఏవో ప్రశ్నలు వేసేలోపలే, కామేశం వచ్చేసేవాడు. చెప్పినపని చేయలేదనో, తప్పులు చేశాడనో, దేనికోదానికి తలవాచేట్టు చివాట్లు పెట్టి పంపేవాడు. ఖిన్నుడై తలవంచుకువేళ్ళే సూర్యాన్ని చూసి అవధానిగారి మనసు క్షోభించేది.

నిజంగా సూర్యం పనిచెయ్యడా, చేతగాదా లేక కామేశం ఊరికనే కేకలు వేస్తున్నాడా? ఏది తెలిసేదికాదు ఏమయినా అంత కఠినంగా, నిర్ధయగా, అతనూ మనిషే అవమానిస్తే బాధపడే హృదయం అతనికి వుంటుందన్న మాట మరచి, తన క్రింద గుమాస్తా అయినంత మాత్రాన అంత అధికారం చెలాయించడం, అంత కఠినంగా మందలించడం అనవసరమేమో అనిపించి కామేశంమీద ఏహ్యం కలిగేదీ ఆ క్షణంలో.

కాని, ఆయనమీద, తోటివాళ్ళమీద, ఆఖరికి నౌకర్లమీద, కనపర్చేమంచి, మర్యాదచూస్తే, సూర్యం మీద ఆ దూకుడంతటికీ కారణం సూర్యంలో లోపమేనేమో, ఆఫీసరుగా తన భాద్యత అతను నెరవేరుస్తున్నాడేమో, కామేశాన్ని అనుమానించడం సరిగాదేమో అని పించేది మరుక్షణం.

ఏమైనా చిన్ననాటి సహవాసం గదా, అంత మరీ కఠినంగా మందలించకుండా, చనువుగా, అభిమానంగా చెప్పకూడదా అనిపించేది. ఇంతకి తనిక్కడికి రాకపోయుంటే, కామేశం ఇంట్లో మకాం పెట్టకుండా వుంటే, సూర్యం అనుభవిస్తున్న పాట్లు చూడక్కరలేకపోయేదేమో! సూర్యం గురించిన బెంగ ఆయనలో రోజురోజుకి యెక్కువ కాసాగింది!

★ ★ ★ ★ ★

‘‘నమస్కారం మేష్టారు!’’ బీచిలో వంటరిగా పరధ్యానంగా కూర్చున్న అవధానిగారు సూర్యం పలకరింపువిని సంతోషంతో పొంగిపోయారు.

‘‘రా, రా, సూర్యం! యిలా వంటరిగా కలుసుకు మాట్లాడాలనీ ఎన్నాళ్ళనించో అనుకుంటున్నాను! వీలే కుదరడం లేదు కూర్చో!’’ ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని ప్రక్కన కూర్చోపెట్టుకున్నారు.

‘‘ఏమిటి సూర్యం! యిలా అయిపోయావు? నువ్వెంతో పైకి వెళ్తావనుకునేవాడిని. యిలా కామేశం క్రింద గుమస్తాగా చూస్తానని ఎన్నడూ అనుకోలేదు.’’ బాధనంతనీ వెళ్ళగ్రక్కారు అవధానిగారు.

''ఏమిటి మేష్టారు, మనం అనుకున్నవి అనుకున్నట్టుగా జరిగితే ఈ ప్రపంచం ఇలా ఎందుకుంటుంది? నోట్లో అక్షరం ముక్కలేని కామేశ కలక్టరవగాలే నిది. నేను గుమస్తానవడంలో ఆశ్చర్యమేముంది?'' జీవంలేని నవ్వునవ్వాడు సూర్యం.

''అదే నన్ను బాధిస్తున్నది! ఇంతకీ నువ్వు చదునెందుకుమానావు?''

''ఏం చెయ్యడం మాష్టారూ? మా ఇంటి సంగతి మీకు తెలుసుగదా! మానాన్నగారి జీతం మీదనే ఆధారం అలాగే ఏదోరోజులు నెట్టుకొచ్చేవాళ్ళం. నాన్నగారు ఎన్ని కష్టాలు పడయినా నన్ను పెద్ద చదువులు చదివించి, పెద్ద ఉద్యోగస్తుని చెయ్యాలని ఆరాటడడేవారు. బ్రతికివుంటే సాధించేవారేమో! నా దురదృష్టం కొద్ది నేను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగానే గుండెపోటు వచ్చి, సంసారభారం నామీద మోపి వెళ్ళిపోయారు. ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముడు, తల్లి, విధవక్కగారు ఇంతమందిని పోషించాలి. ఏం చెయ్యను? చదువుదామని అభిలాష వున్నా రోజులు గడిచేదెలాగా? ఇంటర్ పాస్ కాగానే అతికష్టం మీద, అతి ప్రయాసతో ఈ ఉద్యోగం సంపాదించుకున్నాను. ఇంటిలో ఒక భాగం అద్దెకిచ్చి ఆడబ్బుతో, నా జీతంతో, మా అక్కయ్య చుట్టుప్రక్కల చిన్నపిల్లకి ట్యూషన్ చెప్పి సంపాదించే ఆ కొద్దిపాటి డబ్బుతో తమ్ముడు, పెళ్ళి కావల్సిన చెల్లెలేగాక, నాభార్య, ఒక అబ్బాయి, రేపో మాపో యింకో పసికందు... ఇదీ నా సంసార పరిస్థితి మేష్టారూ! ఏం చెయ్యమంటారు? ఒక్క తెలివితేటలుంటే సరా, అదృష్టముండాలి దేనికయినా, స్కూలు ఫైనలు ఒక్కసారి ఫేలయి ఇంటర్, బి.ఏ పార్టుల వారీగా ప్యాస్ అయిన కామేశాన్ని అదృష్టం వరించింది గాబట్టి అతను అలా పైకెళ్ళాడు.!''

''అంతే, అదృష్టం బాగుండబట్టి ఐ.ఎ.యస్.కి కట్టి సెలక్టుఅయి నాలుగేళ్ళలో కలక్టరయి కూర్చున్నాడు,''

'అయితే సూర్యం నేనొకటి అడుగుతాను ఏమనుకోకుండా చెప్పు. నిన్నెందుకు కామేశం ఆ స్తమానం అలా కేకలువేస్తాడు! నీకు నిజంగా ఈ పని చేతగాదనా! చెయ్యి లేక పోతున్నవా!''

విషాదంగా నవ్వాడు సూర్యం. ''ఏం చెప్పమంటారు మేష్టారూ? ఏణ్ణార్థం క్రితంవరకు చేసేది గుమస్తాపని అయినా సుఖంగా వుండేవాడిని. కనీసం ఆఫీసుగొడవలు నన్ను బాధించేవిగావు. ఈ కామేశం వచ్చిన దగ్గరనించి నా బ్రతుకు దుర్భరమై పోయింది. వచ్చిన వెంటనే చిన్ననాటి సహపాఠిగదా ఏదైనా సాయం పొందవచ్చని ఆశించి ఆనందంగా, అభిమానంగా చూడడానికి వెళ్ళాను. నన్ను చూసి మొహం చిట్లించి ముభావంగా మాట్లాడాడు. ఇహ ఆ తర్వాత నన్ను ఎలాగో

అలాగ ప్రతిదానికి తప్పుపట్టి, ఏదో వంక ఎంచి అందర్లోనూ చిన్నపుచ్చాలని చూస్తాడు. ఏ ఆఫీసరూ, ఏగుమస్తానీ కనీసం బంట్రోతునైనా ఈ విధంగా కించపర్చరేమో! అతనైనా ఒక్కనాతో తప్ప మిగతా అందరితోనూ మామూలు గానే వుంటాడు. నన్ను మాత్రం ప్రత్యేకించి ఎన్ని విధాల బాధలు పెట్టలో అన్ని విదాల పెడ్తున్నాడు. ఒకపూట శెలవు కోసం నానా అగచాట్లు పడాలి. ఒకసారి మా అబ్బాయికి ప్రాణం మీదకి వస్తే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళడానికి ఒకరోజు శెలవు తీసుకుంటే ముందు పర్మిషన్ లేకుండా శెలవు తీసికున్నానని నానాకంగారు చేసి ఆరోజు జీతం కోసే సాడు. క్రితం ఏడు నా భార్య ప్రసవించే రోజు ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి శెలవు కావాలంటే వీల్లేదన్నాడు. నాకు శెలవు వుంది గాబట్టి తప్పని సరిగా కాగితం మీద శెలవు కోరి ఇచ్చి వెళ్ళిపోయాను. అనుమతి లేకుండా వద్దన్నా శెలవు వేసుకు న్నందుకు వార్నింగ్ ఇస్తూ నా పర్సనల్ ఫైల్లో కెక్కించాడు. ఇలా ఎన్నని చెప్పడం! ఇతర సెక్షన్స్ పనులు కూడా నాకు చెప్పి చేయలేదని తిడ్తాడు. కామేశం చేత చివాట్లు తినడం ఇష్టంలేక అక్కడికి అందరికంటె ఎక్కువగా శ్రమిస్తాను అయినా తిట్ల తప్పవు. ఈ బాధలన్నీ భరించలేక, వున్న స్వంత ఊరు స్వంత ఇల్లు కూడా వదులుకోడానికి ఇష్టపడి బదిలీకోసం దరఖాస్తు పెడితే రెండుసార్లు బుట్టిదాఖలు చేశాడు. ఇంక ఈ ఉద్యోగం మానడం ఒక్కటే గతి ! ఇది కాస్త వదలుకుని ఈ సంసారం ఈదడం ఎలా? అందుకే అన్నీ భరిస్తూ, పౌరుషం చంపుకుని బ్రతుకెలాగో ఈడుస్తున్నాను. కామేశం తిట్లు మొదట్లా బాధపెట్టడం లేదు. నాలో చీము, నెత్తురు ఏనాడో హరించిపొయాయి. అందుకే కామేశం నీడని ఇంకా ఇలాగ బ్రతుక గల్గుతున్నాను.''

విషాదంగా, దైన్యంగా, నీరింకినట్టున్న కళ్ళతో సూర్యం చెప్పిన మాటలకి అవధానిగారి హృదయం కుమిలి పోయింది.

''ఎందుకంత కక్ష కామేశానికి? ఏం చేశావని నువ్వు?

''ఎప్పుడో చిన్నప్పుడు పెంచుకున్నపగ, కక్ష ఇలా తీర్చుకుంటున్నడేమో! అంతకన్న కారణమేం కనపడదు నాకు, మీరు వచ్చిందగ్గర నుంచి, ఈ రెండునెలలనించి నా పట్ల మరీ క్రూరంగా ప్రవర్తిస్తున్నాడు, మేష్టారు!''

''నిజంగానా!'' జాలిగా, ఆశ్చర్యంగా అడిగారు అవధానిగారు.

''అవును మేష్టారూ. ఇదివరకటి కంటే ఇప్పుడు మరీ తిట్లెక్కువయాయి. పోనీండి, రోజూ వుండే గొడవే ఇదంతా. బాధపడి ప్రయోజనం లేదుగాని పదండి. ఒక్కసారి మా ఇంటికి రండి, ఇక్కడే దగ్గరే మహారాణి పేటలో''

''పద, ఎన్నాళ్ళనించో వద్దామను కుంటున్నాను, వీలు పడింది కాదు. ఎప్పుడూ ఏదోసాకుతో కామేశం పంపకుండా వున్నాడు'' అవధానిగారు లేచి నిలబడ్డారు.

''అయితే మేష్టారు, మీ రేమిటి కామేశం దగ్గర ఇన్నాళ్ళుండి పోయారు? కామేశానికి మీమీద ఇంత గౌరవాభిమానాలు యెలా వచ్చాయి? మిమ్మల్ని గౌరవంగా చూస్తున్నాడా?'' త్రోవలో అడిగాడు సూర్యం.

''అదేనోయి సూర్యం, ఈ కామేశం సంగతి నాకేం అర్థం కాకుండా వుంది. నన్ను చూసింది మొదలు యెంతో అభిమానం కురిపించి వదలకుండా ఇంటికి తీసుకువచ్చాడు. యెంత చెప్పినా వినకుండా నన్ను వుండమని పదేపదే ప్రాధేయపడుతూ వుంచుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ యెంతో గౌరవాభిమానాలు చూపుతున్నారు. స్వంత కొడుక్కంటే యెక్కువ అభిమానిస్తున్నాడు. చిన్నప్పుడు యెన్నడూ గుర్తువుగా నన్ను గౌరవించనివాడు, ఈ నాడు నన్నిలా అందలం యెక్కించి ఇంత ఆప్యాయత ఎందుకు కనబరుస్తున్నాడో అర్థం కాకుండా వుది. మళ్ళా నానుంచి ఏ ప్రయోజనమూ ఆశించనట్టు కనబడదు. నావల్ల తనకే ఉపకారం లేదు. అఖరికి ఇంట్లో వుంటున్నానని పిల్లలకి చదువైనా చెప్పబోతే ''మీ కెందుకు శ్రమ మేష్టారూ, వాళ్ళకి వేరేట్యూటర్ వున్నాడని'' అదికూడా వద్దన్నాడు. నేనెంత పట్టుదలగా వెళ్ళిపోతానన్నా వదలడం లేదు. ఈ నడి మంత్రపు సిరి మరి నాకెన్నాళ్ళుంటుందో!''

''పోనీండి మేష్టారు, మీకి వద్ధాప్యంలో ఆసరా కల్పించడానికే దేవుడు కామేశానికి ఈ బుద్ధి పుట్టించాడేమో!.. రండి, మేష్టారూ ఇదే మా ఇల్లు.'' అంటూ దారితీశాడు సూర్యం.

చిన్న డాబాఇంట్లో, ఒక ప్రక్క సందులోంచి వెనక భాగంలోకి నడిచారిద్దరూ. ఇంట్లో అడుగుపెట్టిన మేష్టారికి సూర్యం ఇంటి పరిస్థితి ఎంత హీనంగా వుందో ఎవరూ చెప్పనక్కరలేకుండానే బోధపడింది. ఇంట్లో అందరినీ పిలిచి పరిచయం చేశాడు సూర్యం.

''రాక రాక వచ్చారు మేష్టారు! ఇవాళ మా అతిథ్యం స్వీకరించి వెళ్ళండి. కామేశంలాగ పంచభక్ష్య పరమాన్నాలు పెట్టలేనుగాని, యేదో మాకు కలిగినదానితో మేం తినేదే ఇంత అభిమానం కలిపిపెట్టడమే నేను చేయగలిగింది!'' శుష్కహాసం చేసి సూర్యం అన్న మాటలకి అవధానిగారు నొచ్చుకున్నరు.

''అదేమిటి, సూర్యం! నేనేమైనా మొదటినించి రాజభోగాలకి అలవాటు పడ్డవాడినా, నువ్విలా మాట్లాడితే నాకు చాలా కష్టంగా ఉంటుంది!''

ఆ రాత్రికి సూర్యం ఇంట్లో భోంచేసి, అతనితో తనివి తీరా కబుర్లు చెప్పి ఆలస్యంగా ఇల్లు చేరారు అవధానిగారు.

''ఏం మేష్టారూ, ఇవాళ యెక్కడికి వెళ్ళారు? ఇంత ఆలస్యమైంది'' గుమ్మంలోనే పలకరించాడు కామేశం.

''ఏం లేదు, త్రోవలో సూర్యం కనిపించి ఇంటికి తీసికెళ్ళి, వదలకుండా భోజనం తినిపించాడు. అంచేత ఈ ఆలస్యం అయింది.''

కామేశం మొహంలో రంగులుమారాయి. ''సూర్యమా, మొత్తానికి ముద్దుల శిష్యుడింటికి వెళ్ళారన్న మాట, విందు చేశాడా? ఏమంటాడు! కన్నీటిగాథ యేకరువు పెట్టాడా?''

''విందులు చేయడానికి అతనేమన్నా నీలా భాగ్యవంతుడా, పాపం చాలా దీనంగా వుంది అతని పరిస్థితి. వినలేకపోయాను''

''ఏమంటాడు? నా గురించేమన్నా దుమ్మెత్తి పోశాడా?''

''చూడుం నాయునా, పేద వాడి కోపం పెద వికి చేటన్నారు! ఆ సంగతి అతనికి బాగా తెలుసు. ఏమనగలడు? అందులోనూ నీమీద! నేనేభరించలేక పోతున్నాను, అతని స్థితిచూసి! అతను నా ప్రియ శిష్యుడని నువ్వే అంటున్నావు? అందరికీ తెలుసు ఆ సంగతి. అందుకే, ఈ రాత్రి బండికి నేను వెళ్ళిపోదామనుకుంటున్నను''

కామేశం మొహం వివర్ణమయింది. కొద్దిక్షణాలువుండి అదోలాగ నవ్వాడు.

''అయితే సూర్యం కోసం, మీరు బాధపడ్డానికే నిశ్చయించుకున్నారన్నమాట!''

''చూడు కామేశం! నువ్వు పెద్ద అధికారివి. అందరూ నిన్ను ఆకాశానికి ఎత్తుతారు. కాని, నా సంబంధం వేరు, ఆ చనువు పురస్కరించుకుని రెండు మాటలు చెప్పి వెళ్ళి పోతాను. అధికారం, ధనం ఇవాళ వుండి రేపుపోవచ్చు. కాని మమత, అభిమానం అలా క్షణికాలుకావు. అందుకే సూర్యం కష్టాల్ని నేను చూడలేక పోతున్నాను. అందులోనూ, వాటికి నేను కారణం గావడం అసలు సహించ లేను! అన్నింటా అదృష్ట దేవత నిన్ను వరించింది. ఏదీ దక్కని నిర్భాగ్యుడు సూర్యం! అతన్ని చూసి జాలి పడడం మినహా ఏం చేయలేని అసమర్థుడిని! ఏకారణంతో

చేసినా ఈ రెండు నెలలు నన్ను ఆదరించావు. అందుకు నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియదు గురువుగా నన్ను గౌరవించగలిగితే ఒక్క చిన్నమాట. సూర్యాన్ని తోటి మనిషిగా గౌరవించు, సానుభూతి చూపు.... వస్తా. నీకు, నీపిల్లలకి నా ఆశీస్సులు!'' అంటూనే సంచి చేతపట్టుకుని బయటికి నడిచారు అవధానిగారు, ఎర్రబడిన మొహంతో చూస్తున్న కామేశాన్ని వదిలి.

(ఆంధ్రపత్రిక వీక్లీ - 1965)